సంపుటి: 1 | సంచిక: 1

నవంబర్ - డిసెంబర్, 2012

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



క్రిస్మస్ శుభాకాంక్షలతో....



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

క్రీస్తునందు ప్రియమైన స్పర్శ పాఠకులకు శుభములు.

మన తండ్రియైన దేవుని ప్రేమయు, రక్షకుడైన యేసుక్రీస్తు కృపయు ఆదరణకర్తయైన పరిశుద్ధాత్ముని ఆదరణ మిమ్ములను మీ కుటుంబములను పది నెలలు నడిపించినందుకు స్తోత్రములు.

స్పర్శ అను ద్విమాస పత్రిక క్రమముగా చదువుచున్న మీలో అనేకులకు నా ప్రత్యేకమైన వందనములు. మీ ఆత్మ సంబంధమైన సూచనలు, సలహాలు ఎల్లప్పుడూ స్పర్శ పత్రికకు ఎంతో అమూల్యమైనవి. ఈ సంవత్సరాంతము మన జీవితములకు ఎంతో ప్రయోజనకరంగా ఉండాలని కోరుకుంటున్నాను. దానికి ప్రతి ఒక్కరికి స్వీయ పరీక్ష అవసరం. తద్వారా మన లోపములను మనం గుర్తించి దేవుని సహాయం ద్వారా వాటిని జయించడానికి అవకాశం ఉంటుంది. మనలను మనమే విమర్శించుకొనుట వలన తీర్పు పొందక పోదుము అని కొరింథీ సంఘమునకు పౌలు చెప్పినట్లుగా మనలను మనము పరీక్షించుకొనుట లేక విమర్శించుకొనుట వలన క్షేమముగా ఉందుము.

నా ప్రియ సహోదర సహోదరీలకు దేవుని ప్రేమను బట్టి తెలియపరచుచున్న విషయము ఏమనగా మీలో ప్రతి ఒక్కరు మీకు దేవుడు అనుగ్రహించిన పరిచర్యలో అనగా సంఘములలో నమ్మకంగా ఉండవలెను. కడవరి కాలములో అనేక రకములైన మోసపుచ్చు బోధలు, వంచనతో కూడిన కార్యక్రమములు, క్రైస్తవ్యపు విలువలను నష్టపరుస్తుండగా మీ మట్టుకు మీరు అట్టి వాటి చేత తొందర చేయబడక ఏ స్థలమందు దేవుడు మిమ్ములను ఉంచాడో, ఆ స్థలములో నమ్మకంగా జీవించడానికి ప్రధమ స్థానం ఇవ్వవలయును.

రాబోతున్న క్రొత్త సంవత్సరములో దేవుడు ప్రత్యేకమైన కృపతో మిమ్ములను నడిపించాలని, మరింతగా ఆత్మీయ జీవితములో బలవంతులు కావాలని నా ప్రార్థన.

మిమ్ములను, మీ కుటుంబములను దేవుడు దీవించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 1 | సంచిక: 1 నవంబర్ - డిసెంబర్, 2012

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఉపకారం ...... 2
- 1859లో అలస్టర్ ఉజ్జీవం ...... 5
- మరియ (స్త్రీల ప్రత్యేకం) ...... 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 25వ భాగము ...... 10
- బాబోయ్ పగిలిపోయింది (బాలల శీర్షిక) ...... 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ...... 14
- మదర్ తెరీసా ...... 16
- ప్రార్థనా శక్తి ...... 19
- యెహోషాపాతు లోయ ...... 21
- బైబిల్ క్విజ్-25 ...... 22
- జన్మదిన శుభాకాంక్షలు ...... 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఉపకారం

- బ్రదర్. ఎపఫ్రా

ఈ దినములలో మనుష్యులు ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించక అనేక ఇబ్బందులను కొని తెచ్చుకుంటున్నారు. చిన్నతనం నుండి మనం పరిశీలిస్తే చదువుకొనే వయస్సులో చదువుకోక, యుక్త వయస్సులో తల్లిదండ్రులకు సహాయకరంగా ఉండక, బాధ్యతారాహిత్యంగా జీవించి ఎన్నో కష్టములు కొనితెచ్చుకోవడం మనం చూస్తున్నాము. ఇలాంటి వారికి వివాహం చేస్తే బాధ్యతగా ఉంటారని వివాహం చేసి మరింతగా సమస్యల సుడి గుండములో నెట్టి వేస్తున్నారు కొంత మంది జ్ఞానం లేని పెద్దలు. వివాహానంతరం కుటుంబ జీవితములను ఆరంభించి చిట్ట చివరకు ఆత్మహత్యలు, కుటుంబములు విచ్ఛిన్నం అవడం, తద్వారా పిల్లలు అనాధలుగా మారడం దాని ద్వారా సమాజమునకు ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితులు కలుగుతున్నాయి. దేవుడు మానవులమైన మన జీవితములను ఎంతో ఉన్నతమైన విలువలతో జీవించాలని కోరుకోవడం కనబడుతుంది. అందుకే మన జీవితం ఎంత విలువైనదో తెలుసుకొనుటకు మనము పరిశుద్ధ గ్రంథం బాగుగా ఎరుగుట ఎంతో అవసరం.

**ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి. అట్టి యాగములు దేవుని కిష్టమైనవి. హెబ్రీ 13:16** దేవుడు ఒక గొప్ప విలువను మానవులమైన మనకు నేర్పించుచున్నాడు. నూతన నిబంధనా గ్రంథములోని పరిచర్యలో చాలా ప్రాముఖ్యమైన భాగం ఉపకారం చేయడం. దీనిని దేవుడు ఎంతగానో ప్రోత్సహించడం జరిగింది. మనము మన బాధ్యతలను సక్రమముగా నెరవేర్చడమే గాక ఉపకారము చేయుటయందును ప్రత్యేకమైన శ్రద్ధ కలిగి ఉండవలెను. **"మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి. -మత్తయి 5:16** అని ప్రభువైన యేసుక్రీస్తు ఉపకారము చేయుటకు మనలను ప్రోత్సాహపరుస్తున్నారు.

యేసుక్రీస్తు శరీరధారియైయున్న దినములలో తన శిష్యులకు ఉపకార ధర్మమును గురించి అద్భుతమైన విషయములను బోధించడం జరిగినది. ఆయన ఏ సంగతులను గూర్చి బోధించినా సామన్యమైన ప్రజలకు కూడా అర్థం అవడం మాత్రమే కాకుండా హృదయాలకు ఎంతగానో హత్తుకునేవి. జీవితకాలమంతా మరచిపోలేనివిగా ఉండేవి. అలాంటివాటిలో ఒకటి ఈ క్రింది ఉపమానము.

**అప్పుడు రాజు తన కుడి వైపున ఉన్నవారిని చూచి - నా తండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి; నేను ఆకలి గొంటిని, మీరు నాకు భోజనము**



**పెట్టితిరి; దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి. దిగంబరినై యుంటిని, నాకు బట్టలిచ్చితిరి; రోగినై యుంటిని, నన్ను చూడ వచ్చితిరి; చెరసాలలో ఉంటిని నా యొద్దకు వచ్చితిరని చెప్పును. అందుకు నీతి మంతులు - ప్రభువా, ఎప్పుడు నీవు ఆకలి గొనియుండుట చూచి నీకు ఆహారమిచ్చితిమి? ఎప్పుడు పరదేశి వైయుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్ట లిచ్చితిమి? ఎప్పుడు రోగివైయుండుట యైనను, చెరసాలలో యుండుటయైనను చూచి, నీ యొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు- మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును. మత్తయి 25: 34-40.**

మనం మాట్లాడే దానిని బట్టి, మన ఉద్దేశ్యములను బట్టి, ఇతరులకు నేర్పించినవాటిని బట్టి కాక మనం ఏమి చేశామో, ఏమి చేయలేదు అనే దానిని బట్టి తీర్పు తీరుస్తాడు. పైన ఉన్న వచనములలో ఆరు మంచి పనులు కనిపిస్తున్నాయి. ఇవి ఉదాహరణలే కాని మంచి పనులన్నియు ఇవే అనుకొనడానికి వీలులేదు.

దావీదు యోనాతాను అనే తన స్నేహితుని బట్టి ఉపకారము చేయుటకు ఎవరైనా ఉన్నారా? అని పాత నిబంధనలో అడగడం మనకు కనబడుతుంది. ఇది ఒక విచిత్రమైన పరిస్థితి, కారణం చనిపోయిన వారి సంబంధీకులు ఎవరైనా ఉన్నారా అని దావీదు వెదకుచున్నాడు. అయితే ఆ కుటుంబంలో రెండు కాళ్ళూ పనిచేయని కుంటి వ్యక్తి ఉన్నాడని రాజు తెలుసుకొని అతనికి తన భోజనం బల్ల దగ్గర సదా కాలము భోజనం చేయడానికి అవకాశం కల్పించాడు. రెండు కాళ్లూ పనిచేయని కుంటివాడైన ఆ వ్యక్తి పేరు మెఫీబోషెతు. ఇతడు ఒకరకంగా దావీదు స్నేహితుడైన యోనాతానుకు కుమారుడు, మరియొక విధంగా చనిపోయే వరకు దావీదును చంపడానికి ప్రయత్నించిన సౌలుకు మనవడు. మెఫీబోషెతు విషయంలో దావీదు ఉపకార బుద్ధిని చూస్తే, అతని తాతకు చెందిన ఆస్థి అంతటిని పనివానికి అప్పగించి, భూమిని సాగుబడి చేసి పంట అంతటిని తెచ్చి మెఫీబోషెతునకు ఇవ్వవలెనని ఆజ్ఞ ఇచ్చెను.



**" నా యేలిన వాడగు రాజు తన దాసునికి ఇచ్చిన ఆజ్ఞ అంతటి చొప్పున నీ దాసుడనైన నేను చేసెదనని సీబా రాజుతో చెప్పెను. కాగా మెఫీబోషెతు రాజ కుమారులలో ఒకడైనట్టుగా రాజు బల్లయొద్దనే భోజనము చేయుచుండెను." - 2 సమూయేలు 9:11**

ఎంత ఉపకారము! మెఫీబోషెతు అంగహీను డైనప్పటికీ రాజైన దావీదు అతనిని తన భోజన బల్ల దగ్గర ఉంచుకొనుట అవమానంగా ఎంచక తన కుమారులలో ఒకడైయున్నట్లుగా స్వీకరించుట ఎంతో అద్భుతమైన విషయం .

**మరియు అన్నిటి యందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వ సమృద్ధి గలవారై ఉత్తమమైన ప్రతి కార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింపచేయగలడు -2 కొరింథి 9:8.** దీని ప్రకారము మన జీవితములలో కూడా ఉపకారము చేయుటకు ఎల్లప్పుడు సిద్ధమనస్సు కలిగియుండవలెను. యేసు క్రీస్తుని విశ్వసించిన మన జీవితములో విశ్వాసము ద్వారా రక్షించబడి, మత సంబంధమైన క్రియలలో మాత్రమే జీవించుట దేవుని ఉద్దేశ్యము కాదు. **మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము. -గలతీ 6:10.** మేలు లేక ఉపకారము చేయుటకు వారు మంచివారా లేక చెడ్డవారా అని చూడక ఉపకారము చేయుటకు శ్రద్ధ కలిగి ఉండవలెనని దేవుని ఉద్దేశ్యము.

కాబట్టి మనము అనగా క్రీస్తు రక్తములో కడగబడిన ప్రతి ఒక్కరు అనుదిన జీవితములో ఉపకారము చేయడం అలవరచుకొనుట ఎంతో అవసరం. బాధ్యతలను సరిగా చేయని దినములలో ఉపకారము చేయడం కొంత మందికి ఎంతో భారముగా ఉండవచ్చు కాని, క్రైస్తవులు బాధ్యతల విషయంలో ఎప్పుడూ అశ్రద్ధగా ఉండకూడదు. తల్లిదండ్రులు, భార్య పిల్లలూ, అన్నదమ్ములు ఇలా ఎవరి విషయములలో అయినను మన బాధ్యతలను మనము సక్రమంగా నిర్వర్తించాలి. అంతే కాకుండా పరిశుద్ధాత్మ దేవుని వలన మనలో క్రుమ్మరించబడిన ప్రేమ ద్వారా ఉపకారము చేయుట యందు అన్నివేళలా శ్రద్ధ కనబరచవలెను.

ఉపకారము చేయుటకు కావలసిన కృపను, ఆత్మ సహాయము దేవుడు అనుగ్రహించును గాక!




# 1859లో అలస్టర్ ఉజ్జీవం (ఉత్తర ఐర్లాండ్)

1855లో ఉత్తర ఐర్లాండ్‌లోని కొన్నార్ పట్టణంలో గల ప్రిస్బిటేరియన్ సంఘ కాపరి జే.హెచ్.మోర్ దేవుని కోసం 'ఏదైనా చేయమని' తన యవ్వనస్థుల్లో ఒకనికి మనవి చేశాడు. ఈ యవ్వనస్థులు శనివారం స్కూలును మొదలుపెట్టి 2 సంవత్సరాల పాటు ప్రయాసపడ్డారు. కాని వారికి తృప్తి లేదు అయినా వారింకా చేయాలని ఆశించారు. పిల్లల తల్లిదండ్రులు ప్రార్థన సమావేశానికి హాజరు కావాలని వారిని అడిగారు. మొదట్లో కొందరు మాత్రమే స్పందించారు. కాని తరువాత అది తీవ్ర ఆసక్తిని రేకెత్తించింది. ఎందుకంటే దేవుని ఆత్మ క్రొత్తగా తెరువబడిన ఈ సమావేశంలో కుమ్మరించబడ్డాడు.

క్రీస్తు కోసం ఆత్మలను సంపాదించాలనే తీవ్ర ఆసక్తి పనిచేసే వాళ్ళని ఆవరించింది. కూడికలో క్రీస్తు, సిలువ అనేవి మూల అంశంగా మారాయి. ఈ ప్రార్థన గుంపులో నలుగురు యువకులు ఉన్నారు - వారే మిక్విల్కెన్, మెనీలీ, వాల్లేస్, కార్లిస్లే. వారు ప్రార్థన సహవాసంలో బలంగా బంధించబడ్డారు. జార్జ్ ముల్లర్ కథ వారిలో ఎనలేని విశ్వాసాన్ని రేకెత్తించింది. వారు క్రమంగా కెల్స్ పాత స్కూల్లో కూడుకొని ఉజ్జీవం కోసం తమ హృదయాలను దేవుని సన్నిధిలో కుమ్మరించేవారు. ఏక మనస్సుగల విశ్వాసులు వారితో కలిశారు.

ఇప్పుడు ఖచ్చితమైన పట్టుదలతో కూడిన ప్రార్థన వలన ఖచ్చితమైన మారుమనస్సులు చోటు చేసుకొన్నాయి. 1858లో అమెరికా మేల్కొలుపును గురించిన వార్త వారికి అందింది. న్యూయార్క్ పట్టణంలో 12,500 మంది వ్యాపారస్థులు ప్రతి దినం ప్రార్థన కోసం ఎలా కూడుకొనేవారో వారు విన్నారు. యాకోబు వలె "నీవు మమ్మల్ని దీవించకుండా మేము నిన్ను పోనియ్యము" అని వారు మొరపెట్టారు. జవాబు ఆలస్యం కాలేదు. వారి చుట్టూ ప్రార్థన సమావేశాలు విస్తరించాయి. అనుదినం ప్రజలు రక్షింపబడటం జరిగేది. అనతి కాలంలో కొన్నార్ పట్టణం పరిశుద్ధ అగ్ని చేత ప్రత్యక్షపరచబడింది. 1859లో పరలోక అగ్ని గెంతులు వేస్తూ అనేక దిశల్లో వ్యాపించింది... ఆశీర్వాదం కొలెరైన్‌కు వచ్చింది. స్కూలు

మొత్తం రక్షణ పొందింది. ప్రార్థనా ఆత్మ వారిని మోకాళ్ళ మీద ఉంచేంతగా చేసింది. పొరుగువారు, అటుగా వెళ్ళేవారు లోనికి వచ్చేవారు. వారు గడప దాటక ముందే వారందరి మీదికి అదే శక్తివంతమైన ఒప్పుదల వచ్చింది. అప్పుడు వారంతా దేవున్ని వెదకడం మొదలుపెట్టారు. వారి ద్వారా ఉజ్జీవం రాజధానికి ప్రాకింది.

అనేక సంవత్సరాల నుండి ఎలాంటి ఫలం లేకుండా ప్రయాసపడుతున్న సేవకులు అకస్మాత్తుగా తమ చుట్టూ జీవ వాక్యం కోసం పాపులు రావడం చూశారు. వివాదాలకు మారుపేరుగా పరిగణింపబడే జిల్లా ప్రసిద్ధులు సమాధాన సువార్త జయాన్ని సాధించడం గమనించారు. సువార్త వ్యతిరేకులు కూడా క్రీస్తు పాదాల వద్ద మోకరించారు. బెల్‌ఫాస్ట్ పట్టణం ఒక దేవుని పట్టణంగా మారింది. ఒక ప్రత్యేక తరహాలో కొన్నారు పట్టణానికి చెందిన నలుగురు యువకులు సాక్ష్యాన్ని పంచుకోవడం దేవునికి సంతోషాన్నిచ్చింది.

దేవుని ప్రజలు, కొద్దిమందైనా సరే, తమను తాము ప్రార్థనకు సమర్పించుకొన్నప్పుడు దేవుడు ఏమి చేయగలడో చూడాలనే కుతుహలత మీకు లేదా? మీరు పట్టుదలతో, విశ్వాసంతో ప్రార్థించడానికి సమర్పించుకొంటారా?

## క్రిస్మస్ మరియు
## నూతన సంవత్సర ఆరాధన

**క్రిస్మస్ ఆరాధన సమయం:**
డిసెంబర్ 25,
ఉదయం గం. 10.00 లకు

---

**నూతన సంవత్సర ఆరాధన సమయం:**
డిసెంబర్ 31,
రాత్రి గం. 9.00 లకు

**వివరములకు:**
**బ్రదర్. ప్రేమ్ కుమార్ ఫోన్: 9666666249**

# మరియ

- సిస్టర్ వి. విజయ

ఒక సామాన్య స్త్రీ దేవుని చేతిలో ఒదిగిపోయి ఉంటే ఎలాంటి పరిస్థితులనైననూ ధైర్యంగా అధిగమించగలదు. మన బలం, తెలివి, స్వంత జ్ఞానం ధైర్యమును కలుగచేయదు కానీ ఆయన బలమైన హస్తములు వలయమువలె చుట్టి మనలను కాపాడుతున్నాయి అని, గ్రహించాలి. పరిస్థితులు ఎంత భయంకరంగా ఉన్ననూ, వాటికి భయపడుతూ దిన దినము ఏడుస్తూ, నిరాశ లోనికి వెళ్ళక నేను దేవుని సహాయం ద్వారా దేనినైననూ జయించగలను అనే ఆలోచనతో ధైర్యంగా జీవించాలి. మన స్థితి అంతటిని ఆయనకు అప్పగించుకొని, ఆయన చేతులలో ఒదిగిపోవాలి.

బైబిల్ గ్రంథములో క్రొత్త నిబంధనలో ఆరుగురు మరియలు ఉన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రత్యేకమైన మనస్తత్వము, విశిష్ఠమైన వ్యక్తిత్వము కలిగిన వారు. మనము నేర్చుకొనగలిగిన ఎన్నో అమూల్యమైన విషయములు యేసు తల్లియైన మరియ జీవితములో కలవు. విశిష్ఠమైన వ్యక్తిత్వము కలిగిన స్త్రీ. పరిస్థితులు ఏ విధంగా ఉన్ననూ ఏ మాత్రం భయపడక దేవుని చేతిలో ఒదిగి, శరీరధారిగా యేసుప్రభువు ఈ లోకములో జన్మించడానికి తనవంతుగా ఏ విధంగా ఉపయోగపడిందో చూడగలము.



**ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి... దయాప్రాప్తురాలా నీకు శుభము ;ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను ! లూకా 1:28**

మరియం దేవుని దూత చేత దయాప్రాప్తురాలా అని పిలువబడింది. అనగా దయ పొందినది అని అర్థము. మనము మనుష్యుల దయ, గుర్తింపు కావాలని ప్రయాసపడుతూ ఉంటాము. దానికొరకు అనగా మనుష్యులను ఆనందింపజేయుట కొరకు మన మాటలు, పనులు అన్నీ ఉంటాయి. మనుష్యుల గుర్తింపు కొరకు ప్రయాసపడితే అది ఒక దినము వ్యర్థము చేయబడుతుంది. దేవుని దయ మనలను అనుక్షణం కాచి కాపాడి నడిపిస్తుంది. దేవుని దయ కొరకు ఎదురు చూస్తూ ఆయనను ఆనందింపచేయాలి అనే ఆలోచనలతో ఉన్నవారు దేవుని దయకు ప్రాప్తులై, ఆయన యొద్ద నుండి ఆశీర్వచనమును పొందుతారు.

**దూత - మరియా, భయపడకుము, దేవుని వలన నీవు కృప పొందితివి లూకా 1:30**

మరియ దూత ప్రత్యక్షతను చూడగానే భయపడింది. అందుకే దేవుని దూత మరియా, భయపడకుము అని ధైర్యపరుస్తుంది. మనకి కలిగిన పరిస్థితి ఎలాంటిదైననూ మనలను భయపడవద్దు అని ధైర్యం చెప్పుచున్న యేసయ్య మనకి ఉన్నారు. కృప చేతనే మనము రక్షించబడ్డాము. ఆయన వలననే మనకి సమస్తము కలిగాయి. ఆయన లేకుండా ఏదీ కలుగలేదు అని గ్రహించి, దేవుని కృపలో నిలిచి, బలహీనతలలో, సమస్యలలో సైతము దినదినమూ ధైర్యముగా సాగిపోయే వారిగా ఉండాలి.

**"ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును" లూకా 1:31,32**

**"అందుకు మరియ - నేను పురుషుని ఎరుగని దానినే ఇది ఏలాగు జరుగునని దూతతో అనగా లూకా 1:34"**

నీవు గర్భం ధరిస్తావు అని దూత చెప్పగానే మరియ తొందరపడి, బుద్ధిహీనమైన మాటలు ఏమీ మాట్లాడలేదు, అదే విధంగా నోట మాట రాకుండా నిశ్చేష్టురాలై నిలబడలేదు గాని నేను పురుషుని ఎరుగని దానిని ఏలాగు జరుగును? అని జ్ఞానం కలిగి మాట్లాడింది. మనము ఉన్న పరిస్థితులలో ఎవరైనా ధైర్యం చెప్పడానికి ప్రయత్నిస్తుంటే అనేకసార్లు తొందరపడి, బుద్ధిహీనమైన మాటలు మాట్లాడతాము. సమయోచితమైన జ్ఞానము కలిగిన మాటలు మాట్లాడే వారిగా ఉండాలి.

అదే విధంగా మరియ నిబ్బరం కలిగిన స్త్రీగా కూడా కనబడుతుంది. ఎదురుగా ఉన్న పరిస్థితి ఎంతో పెద్దదిగా కనిపిస్తున్ననూ దేవుని చేతిలో తన మనస్సుని ఉంచి ఎన్నో ఒడిదుడుకులలోను, సుఖదుఃఖాలలోను, ధైర్యంగా ముందుకి సాగిపోయింది. మనము కూడా ప్రతిదానికి తలక్రిందులై, ఖంగారుపడి సమస్యని పెద్దది చేసుకోక నిబ్బరమైన మనస్సుతో సాగిపోవడం నేర్చుకోవాలి.

**"ఇదిగో ప్రభుదాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక" అంది (లూకా 1:38)**

సంపూర్ణమైన విధేయతకు ప్రతిబింబం మరియ. ఈ ప్రత్యక్షత ఆమె జీవితం అంతటిని ప్రభావితం చేసింది. ఈ విధేయత జీవితాంతం ఆమెను అంటి నిలిచి ఫలించింది. వివాహము లేకుండా ఒక స్త్రీ గర్భవతి అని తెలిస్తే, లోకములో అందరి దృష్టి ఏ విధంగా ఉంటుందో మనకి తెలిసిన విషయమే కానీ మరియ దేవుని ఉద్దేశ్యమును నెరవేర్చడానికి పూర్తిగా తనని తాను అప్పగించుకుంది. తన భక్తిని ఎవరికీ చూపించుకోవాలని తాపత్రయ

పడలేదు, ప్రధానము చేయబడిన యోసేపుకి, తన చుట్టూ ఉన్న మనుష్యులకు ఆమె నిజాయితీని నిరూపించుకోవాలని ప్రయత్నించలేదు కానీ, దేవుని చిత్తం చేయుటకు పరిశుద్ధాత్మ నడిపింపునకు లోబడింది. గర్భవతిగా ఉన్నప్పుడు కొండ ప్రాంతములకు వెళ్ళి ఎలిసబెత్, జెకర్యాలతో కలిసి ఉండి దేవునిని స్తుతించడానికి ఇష్టపడింది. నా గర్భములో లోకరక్షకుడైన మెస్సీయ ఉన్నాడనే గర్వముతో ప్రవర్తించలేదు. తనని తాను తగ్గించుకొని జీవించడానికి ఇష్టపడింది. అందుకే ఈ విధేయత కలిగిన మనసు ప్రసవ సమయమునకు పశువుల పాకలోకి వెళ్ళి, కుమారుని కని పశువుల తొట్టెలో పండుకోబెట్టవలసి వచ్చిననూ, సిలువలో ప్రియమైన కుమారుడు మేకులతో కొట్టబడుచున్ననూ, తొట్రుపడకుండా, పెదవి విప్పకుండా, స్థిరంగా నిలిచేటట్లు చేసింది. అందుకే ఆమె స్త్రీలలో ఆశీర్వదింపబడినదిగా మార్చబడింది. తరతరముల చేత ధన్యురాలు అని పిలవబడింది.

మనలను మనం తగ్గించుకొని, ఆయన చెప్పిన ప్రతి మాటకు విధేయతతో జీవించి, పరిశుద్ధాత్మ నడిపింపునకు లోబడుట వలన దేవుని ఉద్ధేశ్యములను నెరవేర్చిన వారమవుతాము.

**మరియ ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు భద్రము చేసికొనెను. లూకా 2:19**

యేసుప్రభువు జన్మించిన తరువాత గొర్రెల కాపరులు ఆయనను చూసి, చెప్పిన సంగతులను మరియ తన హృదయములో తలపోసికొనుచూ, భద్రము చేసికొనెను. మన హృదయములలో దేవుని ద్వారా కలిగిన రక్షణ, ఆయన మంచితనము, ప్రేమ, ఆయన ద్వారా పొందిన మేలులు అనుదినము తలపోయుచూ, భద్రము చేసుకోవాలి. మనము వేటిని తలపోయుచున్నాము? భవిష్యత్ గురించిన ఆందోళనలతో జరిగిపోయిన సంగతులను తలచుకొంటూ, హృదయములలో క్రుంగి నిరాశపడక, మరియ వలె దేవుని వాక్యమును తలపోయుచూ ధైర్యముగా జీవించుట నేర్చుకోవాలి. ఆయన ఆరోహణమైన తరువాత మేడగదిలో పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టుచున్న 120 మందితో మరియ కూడా ఉంది.

ప్రియ సహోదరీ! యేసు తల్లియైన మరియ మనకి ఎన్నో పాఠములను నేర్పిస్తుంది. ఆమెలోని తగ్గింపు దేవుని చిత్తం చేయాలనే మనస్సు, విధేయత క్రిస్మస్ దినములలోనే గుర్తు తెచ్చుకొనక ప్రతి దినమూ జ్ఞాపకం చేసుకుంటూ వాక్యమును హృదయములో భద్రపరుచుకొని తలపోయుట ద్వారా దేవుని చేతిలో గొప్ప సాధనములుగా చేయబడతాము. అట్టి కృపను దేవుడు మీకు అనుగ్రహించును గాక !



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 25వ భాగము**

టిబెట్‌లోని మతాచార ప్రకారం ఎవ్వరినీ చంపకూడదు గనుక నేరస్తుని నేరుగా చంపకుండ అతడు చనిపోయే రీతిగా చేసే రెండు పద్ధతులను వారు కనిపెట్టారు. ఎండిపోకుండా ఉన్న యాక్ జంతు చర్మములో నేరస్తుని కుట్టివేసి యాక్ చర్మం సంకోచించుకొనేట్లుగా ఎండలో విడిచి పెట్టేవారు. దానితో అతని ఎముకలు విరిగి విలవిలలాడుతూ చనిపోయేవాడు. రెండవ పద్ధతిలో ఎండిపోయిన బావిలో నేరస్తుని పడవేసి దానిని పూర్తిగా మూసివేసేవారు. ఈ రెండు పద్ధతులలోను చేతులారా మానవుని ప్రాణం తీయడం అనే ప్రసక్తి రాదు. యాక్ చర్మం కుచించుకు పోయే రీతిగా చేసే శక్తులు గానీ, బావిలో పడవేయ బడిన వాడు ఆకలి దప్పులతో ఆ చీకట్లో చనిపోయేటట్లు చేసే శక్తులు గానీ వారి స్వాధీనంలో లేవు గనుక తాము నిర్దోషులమనేది వారి వాదన. సుందర్‌ని నీళ్ళు లేని బావిలో పడవేయాలని నిర్ణయించారు. సుందర్‌ని అక్కడికి ఈడ్చుకొని పోయి బావిపై నున్న ఇనుప తలుపు తాళం తీసి, తలుపు తెరచి బావిలోనికి నెట్టేశారు. ఆ బావి అడుగుకు చేరి అచ్చటి దుర్గంధమునకు తట్టుకోలేక పోయాడు. బావి అడుగున నున్న శవాల ఎముకలు, క్రుళ్ళి కంపు కొట్టుచున్న శవాల దుర్గంధం ఆ బావి అంతా నిండిపోయింది. అయితే బావికి మూత వేసి తాళం వేయడంతో అంత వరకూ లోపలికి వస్తున్న కొంచెం వెలుతురూ మాయమైపోయి కటిక చీకటిలో ఉన్నాడు సుందర్. అంతకు మునుపు తాను అనుభవించిన కష్టములన్నింటి కంటె సుందర్‌కు ఇది ఎంతో ఘోరంగా ఉంది. ఈ సారి ప్రయాణములో అతనికి ఎవ్వరూ తోడు రాలేదు. ఆ దేశంలో తనని ఎరిగిన వారు ఎవ్వరూ లేకపోవడంతో బ్రతికి బయటపడే దారే లేదని గుర్తించాడు. తనకు సహాయం చేయగల మానవుడెవ్వడూ లేడు. అంతేగాక హింస కలిగినపుడు తన హృదయములో ఎల్లప్పుడూ ఉండే ఆనందం ఈసారి మాయమైపోయినట్లుగా ఉంది. యేసుప్రభువు సిలువలో పలికిన ‘నా దేవా, నా దేవా నన్నేల చేయి విడిచితివనే మాటలు జ్ఞప్తికి వచ్చాయి. కాని దేవుని వలన తనకి ఎలాంటి సహవాసం గాని, సహాయం గాని దొరుకుననే నిరీక్షణ లేకుండా పోయింది. ఇలాంటి దుర్భరమైన స్థలానికి దేవుడు తనని ఎందుకు తెచ్చారో ఇక్కడ ఎందుకు ఇలా విడిచిపెట్టారోనని విచారించాడు. అలా ఎన్ని గంటలు గడిపాడో తనకే తెలియలేదు. బావిలో

పడవేసేటప్పుడు అతని చెయ్యి మెలి త్రిప్పారు. అయితే సుందర్ హృదయములో రగులుచున్న వేదనలో చేతి నొప్పి లెక్కలోనికి రాలేదు. ఆ తరువాత కాలములో ఈ సంఘటన గురించి చెప్తూ రెండు రాత్రింబగళ్ళు తాను ఆ బావిలో ఉన్నట్లు చెప్పాడు సుందర్. మూడవరోజు రాత్రి బావిపై నుండి ఒక స్వరం వినబడింది. బావిపైనున్న మూత తీసివేయబడింది. అప్పుడు బావిలోకి ఒక మోకును విసిరి దానిని పట్టుకోమని సుందర్‌కు చెప్పారు. ఉన్న శక్తిని అంతా కూడగట్టుకొని ఆ త్రాడును చంకల క్రింద అమర్చుకున్నాడు. దానితో అతనిని బయటకు లాగి విడిచిపెట్టారు. ఆశ తీర పరిశుభ్రమైన గాలిని పీల్చుకోవడం మాత్రమే సుందర్‌కి గుర్తు. ఆకలి దప్పులతో ఎంతో బలహీనంగా ఉన్ననూ పరిశుభ్రమైన గాలి కోసం అతని ప్రాణం తహ తహ లాడింది. అలా వెలుపలి గాలిని పీల్చుకొనుచుండగా ఆశ్చర్యంగా బలపడ్డాడు. అంతే కాక మెలి త్రిప్పిన ఆ చెయ్యి నొప్పి కూడా తగ్గిపోయింది. ఈ సారి సుందర్ ఒక్కడే మిగిలిపోయాడు. తనను బయటికి లాగిన వ్యక్తి జాడ కనబడలేదు. మరుసటి రోజు మరలా గ్రామమునకు వెళ్ళాడు. మీరు బావిలో పడవేసిన సాధువు బయటకు వచ్చి సువార్త ప్రకటిస్తున్నాడని ప్రధాన లామాకు తెలియజేశారు. సుందర్‌ని పట్టుకొని మరల ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళారు. నీవు ఏలాగు తప్పించుకు వచ్చావని ఆ ప్రధాన లామా ఎంత అడిగినా జరిగిన సంఘటన తప్ప మరో జవాబు చెప్పలేదు. దీనితో రౌద్రుడైపోయిన ఆ లామా, బావి తాళం చెవిని ఎవరో దొంగిలించారు వెదకండి అని ఆజ్ఞాపించాడు. అయితే చివరకు అది అతని నడికట్టులోనే ఉండడం చూచి మరింతగా అదిరిపోయాడు. ఈ సంఘటన వారిని ఎంతో భయాభ్రాంతులను చేసింది. ఏదో మానవాతీతమైన శక్తి చేస్తున్నది గాని అలాంటిది జరగడం ఆ లామాకి ఇష్టం లేకపోయింది. ఈ శక్తిని అతడు ఎదిరించలేడు, సుందర్‌ని మరల ఖైదు చేయమని ఆజ్ఞాపించలేదు గాని వెనువెంటనే తమ ప్రాంతం విడిచి పోవాలని సుందర్‌కు చెప్పారు. గత్యంతరం లేనివాడై ఆ స్థలమును విడిచిపెట్టాడు సుందర్.

ఇలాంటి కష్టాలు సుందర్‌కి మాత్రమే పరిమితమైనవి కావు. అంతకు ముందు హతసాక్షియై పోయిన కర్తార్ సింగ్‌ను గూర్చి సుందర్ తరచుగా చెప్తూండేవాడు.

(ఇంకా వుంది)

సేకరించబడినది



# బాబోయ్ పగిలిపోయింది

ప్రియమైన పిల్లలూ! ఎలా ఉన్నారు? బాగున్నారా? Christmas Shopping plans వేసుకున్నారా! దేవుడు మన కోసం ఎన్నో gifts ఇచ్చారు. మనం తల్లిదండ్రులకు gifts వంటి వారమైతే వాళ్ళు మనకి దేవుడిచ్చిన gifts. కానీ ఈ రోజులలో పిల్లలు తల్లిదండ్రులను అర్థం చేసుకోవట్లేదు. వాళ్ళు ఎంతో ప్రేమతో పిల్లల అవసరాలు తీరుస్తున్నారు. ఈ ప్రపంచంలో వాళ్ళకి మీరే లోకం. మీరు మాత్రం మీ ఆటలు, friends వీటితో తల్లిదండ్రులను అర్థం చేసుకోరు. అలేఖ్య అనే అమ్మాయి తల్లిదండ్రుల ప్రేమను అర్థం చేసుకోక ఎంతగా భయపడిందో చూద్దామా !

అనూషకు ఆకాశంలోని మెరుపులు చూడడం అంటే ఇష్టము. ఒక రాత్రి కుండపోతగా వర్షం కురుస్తుంది. బాల్కానీలో కూర్చుని లైట్లన్నీ తీసివేసి, వర్షమును, మెరుపులను ఎంతో జాగ్రత్తగా గమనిస్తూ ఉంది. sudden గా gate శబ్దం అయితే అటువైపు చూసింది. ఒక అమ్మాయి వర్షంలో పూర్తిగా తడిచిపోయి ఇటు వైపు లోపలికి రావడం గమనించింది.

అనూష అరుస్తూ అమ్మా! త్వరగా రా అని కేక వేసింది. వాళ్ళ అమ్మ వచ్చి, ఆ తడిచిపోయిన పిల్లను చూస్తూ, దగ్గరకు వెళ్తుంటే, అనూష కూడా వెళ్ళింది. తీరా దగ్గరకి వెళ్ళి చూచేసరికి, అనూష స్నేహితురాలు అలేఖ్య. అనూష ఆశ్చర్యంతో తన స్నేహితురాలిని లోపలికి ఆహ్వానించింది. ఇంతలో వాళ్ళ అమ్మ లోపలి నుండి టవల్ తెచ్చి, అలేఖ్యను తుడుచుకోమని చెప్పింది. అలేఖ్య తన స్నేహితురాలితో “ఇంటి నుండి పారిపోయి వస్తున్నాను. శరీరం అంతా చాలా చలిగా ఉంది” అని చెప్పింది. అనూష వాళ్ళ అమ్మ బట్టలు మార్చుకోమని చెప్పింది. వాళ్ళ నాన్న వేడి వేడిగా సూప్ తీసుకు వచ్చాడు. అలేఖ్య అనూష వాళ్ళ అమ్మా, నాన్నను చూస్తూ సూప్ త్రాగడం పూర్తి చేసింది, ఆమె శరీరం వణకడం ఆగిపోయింది.

అనూష వాళ్ళ అమ్మ ఇద్దరిని rest తీసుకొండి అని చెప్పింది. వారిద్దరూ కలసి అనూష రూమ్‌లోకి వెళ్ళారు. రూమ్‌లోకి వెళ్ళిన తరువాత అనూష తన స్నేహితురాలిని “ఎందుకు పారిపోయి వచ్చావు.” అని అడిగింది. అందుకు అలేఖ్య “మా అమ్మ ఎంతో కాస్ట్ పెట్టి గాజుతో చేయబడిన దేవదూత బొమ్మను కొనుక్కొని వచ్చింది. వాళ్ళు ఇంట్లో లేని

సమయంలో దానితో నేను ఆడుతూ ఉండగా పగిలిపోయింది. అది తెలిస్తే మా అమ్మ ఏం చేస్తుందో అని భయం వేసింది. పారిపోతుంటే ఎక్కడికి వెళ్ళాలో తెలియక నువ్వు గుర్తుకు వచ్చి నీ దగ్గరకి వచ్చాను.

అప్పుడు అనూష, "నువ్వు నా దగ్గరకి వచ్చినందుకు చాలా సంతోషం" అని చెప్పింది.

ఇంతలో అనూష వాళ్ళ అమ్మ అలేఖ్య! మీ మమ్మీ ఫోన్ అని పిలిచింది. అలేఖ్య భయకంపితురాలై పోయింది. ఫోన్ మాట్లాడటానికి ఎంతో భయపడుతుంది. అనూష, వాళ్ళ అమ్మ ఇద్దరూ కలిసి, బలవంతంగా అలేఖ్యతో ఫోన్ మాట్లాడించారు. ఫోన్‌లో మాట్లాడిన తరువాత "నీ కంటే ఇష్టమైనది ప్రపంచంలో మాకు ఏదీ లేదు అని అన్నారు మా అమ్మా నాన్నా" అని చెప్పింది. "ఇష్టమైన బొమ్మను పగలగొట్టానని, మా అమ్మకి ఎందుకు కోపం రావట్లేదో ఇప్పటికీ అర్థం కావట్లేదు." అని అలేఖ్య అంది.

అప్పుడు అనూష తండ్రి అలేఖ్యతో "నువ్వు తల్లిదండ్రులను సరిగా అర్థం చేసుకోవాలి. మీ అమ్మా, నాన్న నిన్ను ఎంతో ప్రేమిస్తున్నారు. ఎంతగానంటే నిన్ను చూడకుండా ఉండడం కంటే చనిపోవడమే మంచిది అన్నంతగా." అదెలాగో అర్థం కావట్లేదు అన్నట్లుగా చూచింది అలేఖ్య. అది చాలా తేలిక "దేవుడు మనలను ప్రేమించినట్లుగానే పరలోకమందున్న తండ్రి ఎల్లప్పుడు మనము ఆయనతో ఉండడానికి, ఆయనే మన కొరకు సిలువ వేయబడి మన శిక్ష అంతటిని భరించడం జరిగింది." వెంటనే అలేఖ్య "నేను వారిని ఎంతో ప్రేమిస్తున్నాను, వారు ఎప్పటికీ చనిపోకూడదు అని ఎమోషనల్‌గా అంది"

తరువాత వారందరూ కలిసి అలేఖ్య వాళ్ళ ఇంటికి వెళ్ళారు. వాళ్ల అమ్మా, నాన్న పరిగెత్తుకుంటూ వచ్చి గట్టిగా కౌగలించుకున్నారు. వాళ్ళ అమ్మ ఆనందభాష్పాలతో "అలేఖ్య నాకు నిజమైన దేవదూతవలె కనబడుతున్నది. ఎప్పటికి ఎన్నటికి పగిలిపోదు." అని అంది.

తల్లిదండ్రులు మనలను సరిచేసినప్పుడు మనం సంతోషంగా ఉండాలి కాని మనం భయపడి పారిపోవడం అబద్దాలు చెప్పడం చేయకూడదు. వారు మనలను ఎంతో ప్రేమిస్తూఉంటారు.

చూశారా పిల్లలూ! మన పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న ప్రేమ ఇంత గొప్పదై ఉంటే తల్లిదండ్రులకు, మనకి కూడా తండ్రియైన దేవుడు ఇంకెంతగా ప్రేమిస్తున్నాడో మనం అర్థంచేసుకోవాలి.

మీ అందరికీ ప్రేమతో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ........

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

**ఎమ్. సురేష్ బాబు, రేపల్లె**

నా పేరు ఎమ్. సురేష్ బాబు, గుంటూరు జిల్లా, రేపల్లె మండలం, ఫిరాట్లంక. మాది విగ్రహారాధన కుటుంబము. నేను మా అమ్మమ్మ, తాతయ్యల దగ్గరే 10వ తరగతి వరకు చదువుకున్నాను. చదువులో ఎప్పుడూ ముందు ఉండేవాడిని. 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చాను. ఆ తరువాత డిప్లొమా చేయడానికి గుంటూరు పాలిటెక్నికల్ కాలేజీలో జాయిన్ అయ్యాను. అక్కడ కాలేజీకి సరిగా వెళ్ళకుండా, సినిమాలు, షికార్లు చేస్తూ బంధువుల ఇళ్ళకు తిరుగుతూ నా ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించే వాడిని. చదువు అంటే చాలా ఇంట్రెస్ట్‌తో స్కూల్ ఫస్ట్ వచ్చిన నేను ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నానో నా తల్లిదండ్రులకు అర్థం కాక వీడికి ఏదో అయ్యింది, నక్సలైట్లతో తిరుగుతున్నాడు, మెంటల్ వచ్చింది అని ఎన్నో పూజలు, శనికి శాంతి కూడా చేయించారు. జ్యోతిష్యం చెప్పేవారి దగ్గరకు తీసుకువెళ్ళి, భవిష్యత్ గురించి తెలుసుకునేవారు. ఈ విధంగా నా తల్లిదండ్రులు ఎన్నో బాధలు పడుతూ నేను బాగుపడతానని ఎవరు ఏది చేయమని చెప్తే ఆ విధంగా చేస్తూ నా గురించి ఏడ్చేవారు. తరువాత గవర్నమెంట్ హాస్పిటల్‌కి కూడా తీసుకువెళ్ళి, సైకియాట్రిస్ట్‌కి చూపించి, మందులు వాడించారు.

ఈ విధమైన పరిస్థితులలో ఒకరోజు మా ప్రక్క వీధిలో యేసుక్రీస్తు సువార్త జరుగుచూ ఉండగా మా నాయనమ్మ నన్ను తీసుకొని వెళ్ళింది. అక్కడ ఉన్న పాస్టరుగారికి నా గురించి చెప్పి ప్రార్థన చేయించింది. ఆ విధంగా నేను చర్చికి కూడా వెళ్తూ ఉండేవాడిని కానీ దేవుడు అంటే ఆసక్తి ఉండేది కాదు. ఈ విధంగానే డిప్లొమా కంప్లీట్ చేసాను. తరువాత 2003వ సంవత్సరములో ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కి వచ్చి మా మామయ్య వాళ్ళ ఫ్రెండ్ కంపెనీలో జాయిన్ అయ్యాను. అక్కడ జీతం తీసుకున్న తరువాత నుండి నా తోటి వారితో కలిసి త్రాగుడుకి అలవాటు పడ్డాను. అప్పుడు నామకార్థంగానే దగ్గరలో ఉన్న చర్చికి వెళ్ళేవాడిని కానీ మారుమనస్సు, రక్షణ గురించి ఏమీ చెప్పేవారు కారు. మా బంధువుల ద్వారా ఎపఫ్రా మినిస్ట్రీస్ గురించి నాకు తెలిసింది. 2005వ సంవత్సరము చింతల్‌లో మందిరం ప్రారంభించినప్పుడు మొదటిగా వెళ్ళాను. ఆ తరువాత ఆసక్తిలేక సరిగా వెళ్ళేవాడిని కాను.

మరల వేరొక ఉద్యోగం కొరకు మన పరిచర్యలో ఒక బ్రదర్ చేయుచున్న కంపెనీలో జాయిన్ అయ్యాను. ఆ బ్రదర్ నాకు ఎక్కువగా దేవుని మాటలు చెప్తూ, ప్రార్థనలకు తీసుకువెళ్తూ ఉండడం వలన చర్చికి ఎక్కువగా రావడం మొదలుపెట్టాను. ఒకరోజు ఎపఫ్రా బ్రదర్ చెప్పుచున్న వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు నాతో మాట్లాడడం వలన మారుమనస్సు పొందాను. మారుమనస్సు నిమిత్తం 2005, డిసెంబర్‌లో బాప్తిస్మం

తీసుకున్నాను. తరువాత యూత్ మీటింగ్స్, ఉపవాస ప్రార్థనల ద్వారా నేను దేవునిలో ఎలా నడుచుకోవాలో తెలుసుకున్నాను. అలాగే సంఘములోని సహోదరుల ప్రేమ, ఇతరులకు పరిచర్య చేయాలి అనే సేవా భావం, తగ్గించుకునే మనస్సు చూచి, ఆ విధంగా జీవించాలి అని నేర్చుకున్నాను.

ఆ తర్వాత నేను ఊహించని విధంగా ఉద్యోగంలో జీతం రెండింతలు పెరిగింది, టూవీలర్ కూడా ఇవ్వబడింది. నేను ఇష్టపడిన అమ్మాయితో వివాహం జరిగింది, ఆమె కూడా మారుమనస్సు పొంది బాప్తిస్మం తీసుకుంది. సంతానం కలగడం కొద్ది దినములు లేట్ అవ్వడం వలన మా తల్లిదండ్రులు కొంచెం నిరాశ చెందారు. అప్పుడు మేము దేవుని వేడుకొనగా మమ్మల్ని కనికరించి, గొప్ప కార్యమును ఆయన జరిగించారు. నాకు ఇద్దరు పిల్లలు.

ఉద్యోగంలో పని నిమిత్తము దూర ప్రాంతములకు వెళ్ళవలసి వచ్చేది. అక్కడ చర్చికి వెళ్ళడం కాని, బైబిల్ చదవడం కాని చేసే వాడిని కాదు. కొన్ని నెలల తరువాత నాకు భయం కలిగింది. అక్కడ నుండి వచ్చి బ్రదర్‌ని కలిసి ప్రార్థన చేయించుకోగానే మనస్సు సమాధాన పడింది. అనేక విషయములలో దేవుడు నన్ను కరుణించి, ప్రయాణములలో, ఉద్యోగములో, ఇంట్లోని ఆర్థిక విషయములలో ఏ లోటూ లేకుండా సహాయం చేస్తున్నారు. దేవునికి స్తోత్రములు. .

ఏ గురి, గమ్యం లేకుండా ఇష్టానుసారంగా తిరుగుతున్న నన్ను ఆయన కనికరించి, ఉచితమైన ఆయన కృప చేత రక్షించి, మంచి పరిచర్యలో కుటుంబమంతా కలిసి ఆయనను ఆరాధించునట్లుగా సహాయం చేసిన దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నాను. మేము దేవుని కొరకు జీవించే పాత్రలుగా చేయమని మా కొరకు ప్రార్థించగలరు.

## ముఖ్య గమనిక:

ఉదయం 10.30 గం॥ల - సాయంత్రం 6.30 గం॥ల వరకు
మీ ప్రార్థనావసరతలకై సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# మదర్ తెరీసా

## మదర్ తెరీసా మనోభావాలు

### దైవ ప్రేమ

హృదయపూర్వకంగా, పరిపూర్ణాత్మతో, మనస్ఫూర్తిగా దేవుణ్ని ప్రేమించు – అదేవిధంగా నీ పొరుగువాన్ని కూడా ప్రేమించు. ఇది దైవాజ్ఞ. ప్రేమ అనేది సర్వకాలాల్లోనూ అందరికీ అందుబాటులో వుండేది. ప్రేమకు అంతులేదు. ఎంతైనా పొందవచ్చు. ధ్యానంద్వారా, ప్రార్థన ద్వారా, త్యాగంద్వారా, చిత్తశుద్ధిద్వారా ఈ ప్రేమను ప్రతివారూ అనుభవించవచ్చు.

### ప్రార్థన

ప్రార్థన లేకుండా ఏ సేవనుకూడా తలపెట్టలేం. క్రీస్తు తానెప్పుడూ ప్రార్థిస్తూ తండ్రితో ఆస్తిత్వం పొందేవాడు. అలాగే మనం కూడా క్రీస్తుతో ఏకత్వం పొందాలి. క్రీస్తు మహాశక్తిమంతుడు. ఆయన ప్రేమ మనలో పనిచెయ్యాలని ఆయన అభిలషిస్తున్నాడు. ఎప్పుడైతే క్రీస్తును మనకూ, మనద్వారా ఇతరులకూ చెయ్యనిస్తామో అప్పుడే మన సేవ సార్థకమవుతుంది. మనం పవిత్రంగా వుండాలి. అప్పుడే క్రీస్తు మనలో నివసించడానికి వీలుకలుగుతుంది. మన జీవితం అంతా ప్రేమభరితం కావాలి. విశ్వాసపూరితం కావాలి. పవిత్రమయం కావాలి. నిరుపేదల సేవలో పండిపోవాలి. దేవుని చిత్తమును గ్రహించితే నిరుపేదలు మన పవిత్రతకు కారణభూతులవుతారు

ప్రార్థన మన ఊపిరి. ప్రార్థించే ఆవశ్యకతను మనం గుర్తించాలి. ఏకాగ్రతతో ప్రార్థించాలి. ప్రార్థన మన హృదయాన్ని విశాలం చేస్తుంది. ఆ విశాలంలో దేవుడు ఆశీనుడవుతాడు. నువ్వు ప్రార్థించినకొద్దీ నీ హృదయం విశాలమై దేవుణ్ని అందులో ప్రతిష్ఠించి నీ పరంచేస్తుంది.

### పవిత్రత

దేవుని కృప మీద, మన నిర్మలమైన మనస్సు మీద పవిత్రత అనేది ఆధారపడి ఉంది. పవిత్రంగా ఉండాలన్న దృఢసంకల్పం మనకుండాలి. పవిత్రంగా ఉండాలంటే దేవునికి అయిష్టమైన క్రియలన్నిటిని త్రోసివెయ్యాలి. మన హృదయం చుట్టూ అడ్డుగా నిర్మించుకున్న వాటన్నిటిని కూలద్రోయాలి. పేదరికంలోనే నేను నివసించాలి. నా మనస్సుకు, రాగద్వేషాలకు, కోరికలకు స్వస్తి చెప్పి – దైవ చిత్తానికి బానిసనవ్వాలి. ఈ భావన కలిగినప్పుడే పవిత్రత ఏర్పడుతుంది.

దేవుని చిత్తాన్ని చిరునవ్వుతో జరిగించడమే నిజమైన పవిత్రత.

## సమర్పణ

ఆయన నీకేది ఇస్తాడో దాన్ని స్వీకరించు; ఏది తీసుకుంటాడో దాన్ని సమర్పించు.

## విశ్వాసం

దేవుడిచ్చే వరాలలో విశ్వాసం ఒకటి. విశ్వాసంలేకపోతే అసలు జీవితమే లేదు. మన సేవ ఫలభరితం కావాలి. దేవునికది అందమైన పనిగా మారాలి. ఇలా జరగాలంటే మన పనికి విశ్వాసం ఆయుపట్టు కావాలి.

## సేవ

దేవుడున్న చోట ప్రేమ ఉంటుంది. ప్రేమవున్న చోట సేవ ఉంటుంది.

## ప్రేమ పలకరింపు

ఆస్తిపరులుకూడా ప్రేమకు అర్రులుచాచేవారే. ప్రేమకోసం తపించిపోయే వాళ్లే. ప్రేమానురాగాలతో పలకరించే తమ వాళ్లు తమకుండాలని ఆశిస్తారు.

## ప్రేమ క్రియలు

పరులతో పంచుకోలేని ప్రేమకు అర్థంలేదు. ప్రేమ క్రియల్లో కనిపించాలి. ఇతరుల దగ్గరనుంచి ఏదో ఆశించి ప్రేమను ప్రదర్శించకూడదు. ఫలాపేక్షలేనిదే స్వచ్ఛమైన ప్రేమ.

## దైవసన్నిధి

సర్వదా దేవుని సన్నిధానం మనతో ఉన్నదని ధ్యానించడమే మన ధ్యేయం. అతి స్వల్పమైన విషయాలలో కూడా దేవుని ఉనికి మనకవసరం. అందులో కూడా ఆ ప్రేమామయుడు ప్రత్యక్షమౌతూనే ఉంటాడు.

## ఇరుగుపొరుగు

ముందుగా మనకు దగ్గర్లో ఉన్నవారిని ప్రేమించడం నేర్చుకోవాలి. అది మన ఇంట్లోనే మొదలవ్వాలి. అప్పుడే ఇరుగు పొరుగు వారిని ప్రేమించగలుగుతాం.

## జీవితాశయం

ప్రేమించడం అనేది మన జీవితాశయం. అది మన కర్తవ్యం. మనం మరణించి దేవుని సన్నిధానంలో చేరినపుడు మనకు తీర్పు జరుగుతుంది. ఎన్ని పనులు చేశామన్నది లెక్కకురాదు. ఎంత ప్రేమతో ఆపనులు చేశామన్నదే లెక్క. దేవుని తీర్పు దీనిమీదనే ఆధారపడి ఉంటుంది.

## పరిచర్య

ప్రార్థన ద్వారా విశ్వాసం, విశ్వాసం ద్వారా ప్రేమ, ప్రేమ ద్వారా పరిచర్య ప్రాప్తిస్తాయి

## దయ

దయాదాక్షిణ్యం మనిషి కుండాల్సిన ముఖ్య లక్షణం. నీ దగ్గరకొచ్చేవాళ్ళు సంతోషంగా వెళ్ళేటట్టుచూడు.

దేవుని దయకు సజీవ ప్రతీకగావుండు. నీ ముఖంలో, నీ కళ్ళల్లో, నీ నవ్వులో దయ కనిపించాలి.

మురికి వాడల్లో సేవ చెయ్యడానికి మనం వెళ్తుంటాం. అలాంటి సమయాలలో మనం దేవుని దయకు ప్రతీకలం, చీకటిలో వెలిగే కాంతి కిరణాలం.

బాధపడే పిల్లలకూ, పేదవాళ్లకూ మనం ఉల్లాసంగా కనిపిస్తూ, చిరునవ్వులు అందించాలి. కేవలం శ్రద్ధచూపితే చాలదు. మన హృదయాన్ని వాళ్ళకివ్వాలి.

## ఆనందం

ప్రార్థనే ఆనందం... శక్తి ఆనందం... ప్రేమే ఆనందం అనేది ప్రేమపూరితమైన వలలాంటింది. అది ఎన్నో జీవాత్మలను పడుతుంది. ఆనందంగా యిచ్చేవాళ్ళను దేవుడు ప్రేమిస్తాడు. ఆనందంగా ఎవరిస్తారో వాళ్ళే ఎక్కువ ఇచ్చినట్టు. మనకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ, ప్రతి విషయాన్ని ఆనందంతో స్వీకరించడమే దేవునికి స్తుతిచెల్లించడం.

నీ మనస్సులో ఏ విషయాన్నీ నీ సమస్యనూ తిష్టవెయ్యనీకు – అలా చెయ్యడం వల్ల పునరుత్థానుడైన క్రీస్తు నీకు అందించే ఆనందానికి దూరమయ్యే ప్రమాదముంది !

## దేవుని నమ్ముకో ...

దేవున్ని నమ్ముకో, నిన్నొదిలిపెట్టడు. నీ పనికి అన్నీ సమకూర్చుతాడు. అలా జరగకపోతే ఆ పని ఆయనకు ఇష్టం లేదన్నమాట..

## శ్రమ

శ్రమపడకుండా సేవచేస్తానంటే అది కేవలం మెప్పుకోసం చేసేది మాత్రమే అవుతుంది. అది యేసుక్రీస్తు సేవ అనిపించుకోదు. ఆయన ప్రసాదించే విముక్తి అనిపించుకోదు. యేసు – మన జీవితాన్ని, మన ఒంటరితనాన్ని, మన ఆవేదనని, మన చావునూ పంచుకుని తాను సేవ చేశాడు. మనలో ఒకడిగావుండి మనకు విముక్తిని ప్రసాదించాడు. మనం కూడా అలాగే చెయ్యాలి. దిక్కుమాలిన ప్రజలకు సన్నిహితంగావుంటూ, వాళ్ళ దారిద్ర్యంలో మనం భాగం పుచ్చుకుంటూ వాళ్ళ ఆధ్యాత్మిక దారిద్ర్యాన్ని తొలగిస్తూ – దేవున్ని వాళ్ళ జీవితాలలో ప్రవేశ పెట్టాలి.

# ప్రార్థనా శక్తి

## ప్రార్థన దేవుని శక్తిని విడుదల చేస్తుంది

మన అందరి జీవితములలో దేవుని యొక్క శక్తి అవసరమైయున్నది. కొన్నిసార్లు అద్భుతంగా, అనుకోకుండా కూడా దేవుని శక్తిని విడుదల చేసే బలము ప్రార్థనే. దీనికి బైబిలులోని ఒక ఉత్తమమైన ఉదాహరణ యూదా రాజైన యెహోషాపాతు కథ, (2 దిన 20వ అధ్యాయం) మోయాబీయులు, అమ్మోనీయులు - యెహోషాపాతుపై యుద్ధమునకు వచ్చియున్నారు. ఈ రాజ్యములు "గొప్పసైన్యముగా" యూదాకు విరోధముగా కూడి వచ్చినప్పుడు యెహోషాపాతు రాజు భయపడినాడు. అయితే అతను ఉపవాసముండి ప్రార్థించ మొదలుపెట్టాడు. తన ప్రజలైన యూదావారిని కూడా ఇదే విధంగా చేయమని చెప్పాడు. దేవుని ఆత్మ యెహజీయేలు పైకి వచ్చి అతను ఈ విధంగా ప్రవచించాడు. "యూదావారలారా, యెరూషలేము కాపురస్తులారా, యెహోషాపాతు రాజా, మీరందరును ఆలకించుడి, యెహోవా సెలవిచ్చునదేమనగా - ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, ఈ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును, రేపు వారి మీదికి పోవుడి వారు జీజు అను ఎక్కుడు మార్గమున వచ్చెదరు, మీరు యెరూవేలు అరణ్యము ముందర ఉన్న వాగు కొన దగ్గర వారిని కనుగొందురు. ఈ యుద్ధములో మీరు పోట్లాడవలసిన నిమిత్తం లేదు. యూదా వారలారా యెరూషలేము వారలారా, మీరు యుద్ధ పంక్తులు తీర్చి నిలువబడుడి, మీతో కూడా ఉన్న యెహోవా దయచేయు రక్షణను మీరు చూచెదరు, భయపడకుడి, జడియకుడి, రేపు వారి మీదికి పోవుడి, యెహోవా మీతో కూడా ఉండును" (2 దిన 20:15-17)

ఉపవాసము ఉండి ప్రార్థించి, దేవుని ఒక సంఘముగా వెదికి, దేవుడు జయము ఇస్తాడని చెప్పిన ప్రవచనమును వినిన తరువాత, యెహోషాపాతు రాజు విజయమునకు వ్యూహం అమలు చేయడం మొదలుపెట్టాడు. "మరియు అతడు జనులను హెచ్చరించిన తరువాత యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడుచుచు - **యెహోవా కృప నిరంతరముండును, ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను" (2 దిన 20:21)** ఈ స్తుతి ఆరాధనలు కూడా ప్రార్థనలో రకములని గ్రహించాలి. **"వారు పాడుటకును, స్తుతించుటకును మొదలుపెట్టగా, యెహోవా యూదా వారి మీదికి వచ్చిన మోయాబీయుల మీదను, అమ్మోనీయుల మీదను, శేయీరు మన్యవాసుల మీదను, మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి" (2 దిన 20:22)**

మనము ప్రార్థించినప్పుడు, దేవుడు క్రియ చేస్తాడు. దేవుడు పని చేయునట్లుగా ప్రార్థన ద్వారం తెరుస్తుంది. యెహోషాపాతు విషయములో యూదా ప్రజలు దేవుని విడుదల చూచుచుండగా శత్రువులు కలవరపడి, తమ్మును తామే పొడుచుకొని చనిపోయారు. వారు తమ ప్రార్థనలో విశ్వాసం కలిగి ఉన్నారు, దాని ఫలితంగా దేవుడు వారి పక్షమున యుద్ధం చేసి జయించాడు. మన జీవితములలో దేవుని శక్తి ఏ విధంగా జయము నిస్తుందో చెప్పే అద్భుతమైన కథ యూదా వారిది.

**ప్రార్థనాశక్తి ద్వారా అమెరికాలో జరిగిన ఆధునిక అద్భుత సంఘటన:**

1999 లో అమెరికాలో కాల్చబడిన భయంకరమైన విషాదకరమైన కాల్పులలో గాయపడిన మొదటి విద్యార్థి మార్క్. అతను ఆ కాల్పులు మొదలైనప్పుడు కాఫీ త్రాగుటకు బయట వేచి నిల్చున్నాడు. మొదటి కాల్పుకి భరించలేని బాధను అనుభవిస్తూ తన శరీరంలో నుండి రక్తం వస్తుండగా "ఓ, నా దేవా నాకు సహాయం చేయి !" అని అరవడం మాత్రమే తనకు జ్ఞాపకం ఉంది. కాల్పులు ముగిసే సమయమునకు అతని వీపుపై రెండుసార్లు, ఛాతీపై ఐదు సార్లు కాల్చబడ్డాడు. అవి అతని దేహమును చీల్చుతూ అతని గుండెకు ఎడమవైపున్న రక్త నాళం వెనుక దిగబడ్డాయి. ఊపిరి పీల్చుకోవడానికి ఎంతో కష్టమైపోయింది. కాల్చేవారి నుండి తప్పించుకొనుటకుపరిగెడుతూ అనేక మంది విద్యార్థులు అతని శరీరమును త్రొక్కారు. అతడు చనిపోయాడని అందరూ అనుకున్నారు. "ఎవరూ నాకు సహాయం చేయలేదు, అయితే దేవుడు నాకు సహాయం చేశాడు" అని మార్క్ చెప్పాడు. దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తీసుకువెళ్తుండగా చనిపోతానేమో అని మార్క్ భయపడ్డాడు. "దేవా నన్ను రక్షించమని నేను ప్రార్థించాను, ఆయన నాకు జవాబు ఇచ్చాడు. ఆ క్షణమే, నా ప్రాణమును దేవుడు కాపాడుతున్నాడని నాకు నిశ్చయత కలిగింది" అని మార్క్ చెప్పాడు. మార్క్‌కు చికిత్స చేస్తున్న వైద్యుడు "నేను ఒక శవాన్ని చూస్తున్నాను" అని అనడం జరిగింది. అయితే మార్క్ ప్రార్థనలను దేవుడు విన్నాడు. కొంతకాలం ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిగిన తరువాత మార్క్ కోలుకున్నాడు.


చూశారా! ప్రార్థన ద్వారా వెలువడిన దేవుని యొక్క శక్తి.

# యెహోషాపాతు లోయ (కిద్రోను లోయ)



ఈ లోయ క్రొత్త నిబంధనలో కిద్రోను లోయగా తెలియబడుచున్నది. దీనిని కిద్రోను వాగుగా కూడా వ్యవహరించెదరు. ఇది యెరూషలేమునకును, తూర్పున ఉన్న ఒలీవల కొండకును మధ్య ఉన్నది. దావీదు అబ్షాలోముకి భయపడి పారిపోయినప్పుడు దీనిని దాటెను. సొలొమోను షిమీని యెరూషలేము నందు ఖైదీగా ఉంచి దీనిని దాట నివ్వలేదు. రాజు అయిన ఆసా తన అవ్వ చేయించిన దేవతాస్తంభములను కాల్పించి, ఈ లోయలో పారవేయించెను. రాజైన యోషీయా కూడా విగ్రహములను అదే విధముగా ఈ లోయలో కాల్చి వాటి బూడిదెను ఈ వాగు నందు వేయించెను. ఈ లోయ అంచుననే దేవాలయము కట్టబడినందున, హిజ్కియా కాలములో యాజకులు ఆలయమును పవిత్రపరిచి, చెత్త అంతయు ఎత్తి ఈ లోయలో పారవేసిరి.

క్రీస్తు ఒలీవ కొండకు వెళ్ళినప్పుడు దానిని దాటెను. యెహోషాపాతు అను పదమునకు యెహోవా తీర్పు చేయు స్థలమని శబ్దార్థము. అరిమెగిద్దోను యుద్ధము నిశ్చయింపబడు ప్రదేశము అని, దేవుడు అన్యజనములకు యెహోషాపాతు లోయలో తీర్పు చేయుటకు వచ్చునని యావేలు గ్రంథము నందున్నది. అంత్య తీర్పు ఈ లోయలో జరుగునని కొందరి తలంపు.




# బైబిల్ క్విజ్ -25

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

పేతురు వ్రాసిన పత్రికలలో నుండి ఇవ్వబడినవి

**1.** బబులోనులో మనవలె ఏర్పరచబడినవారు ఎవరు ? ఏమని చెప్పుచున్నారు ?

**2.** పూర్వము దేవుని ఆశ్రయించిన స్త్రీలు దేని చేత తమ్మును తాము అలంకరించుకొనిరి ?

**3.** మనలోని పెద్దలను పేతురు ఏమని హెచ్చరిస్తున్నాడు ?

**4.** పేతురు వ్రాసినవి మరొకరు వ్రాశారని, కొన్ని గ్రహించుట కష్టమైనవని ఎవరిని గూర్చి ?

**5.** ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఏమి చేయాలి ?

**6.** పేతురికి తన గుడారము త్వరగా విడిచిపెట్టవలెనని ఎవరు సూచించారు ?

**7.** కీడు చేసి శ్రమపడుట కంటె మేలు చేసి శ్రమపడుట ఎటువంటిది ?

**8.** మనము దేని మీద లక్ష్యముంచితే మేలు కలుగును అని పేతురు చెప్పాడు ?

**9.** క్రీస్తు దేనియందు శ్రమపడెను ?

**10.** బిలాము అతిక్రమము నిమిత్తము ఏ విధంగా గద్దింపబడెను ?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిసెంబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి 2013 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 24 జవాబులు (యాకోబు పత్రిక) :**

| | |
|---|---|
| **1**. నీతిమంతుని విజ్ఞాపన 5 :16 | **2**. అబ్రాహాము 2:23 |
| **3. పాపము 4**:17 | **4.** పై నుండి వచ్చు జ్ఞానము 3:17 |
| **5. శత్రువు 4**:4 | **6.** జీవకిరీటం 1:12 |
| **7.** ప్రవక్తలను **5**:10 | **8. భోగేచ్ఛలనుండియే 4**:1 |
| **9.** నాలుక **3**:6 | **10.** ద్విమనస్కులు 4:8,9 |

**బైబిల్ క్విజ్ - 24 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

కొర్నేలీ, పూజిత, రాణి, దివ్య, శ్యాంప్రసాద్, స్వరూపారాణి, కృప, కనికరమ్మ, జాన్‌పాల్, యేసమ్మ, సరస్వతి, రూప, ఆమోసు, హేమలత, రాజ్‌కుమార్, వాణి, రాజ్యం, చంద్రకళ, సుధారాణి.




# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత** : సుధారాణి, హెప్సిబా, మణి, మేఘన, రాధిక, ప్రజ్ఞ, ప్రవీణ్, ప్రవల్లిక, అభిషేక్, కనికరమ్మ, రూప, థామస్, రమేష్, తర్షీనా, రాజ్‌కుమార్, సతీష్‌బాబు, అమూల్య, చంద్రకళ, పుష్పలత, రాధిక, లూధియ, సతీష్, నవీన్, కరుణ, కృష్ణవేణి, ప్రవీణ్, ఆశీర్వాదమ్మ, దివ్యజ్యోతి, అనిష్‌ప్రసాద్, ఫిన్నీనోయల్, భవ్యదీపిక

**చింతల్ :** రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వర్రావు, నాగేశ్వర్రావు, సుహాసిని, కుమారి, పావని, దానియేలు, దివ్యజ్యోతి,సాల్మన్,ఎస్తేరురాణి,మంజుల, లక్ష్మారెడ్డి,

**అనాజ్‌పూర్ :** థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్

**ఇ.సి.ఐ.యల్ :** ప్రేమ్‌కుమార్.



**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________


మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# క్రిస్మస్ కానుక

ఈ భూగోళం మీద ఉన్న సమస్త మానవాళి చరిత్రను రెండు భాగాలు (క్రీస్తుపూర్వం, క్రీస్తుశకం)గా చేసిన ఆరోజు, మన క్యాలెండర్‌లలో, కంప్యూటర్లలో కనిపించే తేదీలకు ఆధారమైన ఆరోజు క్రీస్తు యేసు పుట్టినరోజు. అసమానుడైన క్రీస్తు పుట్టిన ఆరోజును ప్రపంచమంతా పండుగగా ఆచరిస్తుంది. అయితే యేసుక్రీస్తు పుట్టుక ద్వారా ప్రతి మనిషికి దేవుడు సిద్ధపరచిన అమూల్యమైన బహుమానమును అనేక మంది గుర్తించలేక పోతున్నారు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణం ఏమిటో ఈ చిన్న ఉపమానం ద్వారా సులభంగా అర్థమవుతుంది. ఒకరోజు ఒక తండ్రి 7 సంవత్సరాల కుమారుడితో కాలువ గట్టున కూర్చుని ఉన్నాడు. ఆ కుమారుడు కాలువ ఒడ్డు అంచున ఉన్న చీమలగుంపును గమనిస్తూ ఆనందిస్తున్నాడు. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండటంతో ఆ చీమలు నీటిలో పడి కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఆ బాలుడు వాటి స్థితి చూసి చాలా బాధపడుతూ ఒడ్డుకు వచ్చేయండి లేకపోతే కొట్టుకుపోతారు అని అరుస్తున్నాడు. చీమలకు వినబడాలని ఎంత అరిచినా ఫలితం శూన్యం. అప్పుడు తండ్రి కుమారునితో ఇలా అన్నాడు. "నువ్వు ఎంత అరిచి బాధపడినా ప్రయోజనం లేదు. చీమలు నీ భాష అర్థం చేసుకోలేవు. నీవు చీమగా మారితే వింటాయి. అప్పుడు కుమారుడు నేను చీమగా మారి వాటిని రక్షిస్తాను అన్నాడు. వాటిని రక్షించుకోవాలనే తపనతో ఆ బాలుడు అమాయకంగా మాట్లాడినా, సరిగ్గా అటువంటి నిష్కళ్మషమైన, నిస్వార్థమైన ప్రేమ దేవుని కుమారుడైన యేసును రక్తమాంసములు కలిగిన మనుష్యునిగా మన మధ్య జన్మింపచేసింది. దేవుడు మన భయాలను పోగొట్టి మన ఆత్మను విడిపించాలని తన సొంత కుమారుడిని మన కోసం మన మధ్యకు పంపించాడు. కన్య మరియు పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టింది. తండ్రి అయిన దేవుడు నీ యొక్క జన్మ, కర్మ పాపములను సిలువలో తన కుమారుని మీద మోపి మనలకు విమోచనను సిద్ధపరిచాడు.

యేసు జన్మ పునీతమైనది, ఆయన గుణము సాటిలేనిది, ఆయన జీవితము విశిష్టమైనది. యేసు జన్మించుటకు 700 సం.ల పూర్వమే ఆయన జన్మించే విధానం, జన్మస్థలం, సిలువ మరణము మరియు పునరుత్థానము గురించి దేవుడు స్పష్టమైన వివరాలను తన భక్తులద్వారా గ్రంథస్థం చేయించాడు. యేసును మించిన కారణజన్ములు ప్రపంచ చరిత్రలో మరెవ్వరులేరు, ఇక ఉండబోరు. నీ జీవితానికి జవాబు అయి ఉన్న యేసును, అమూల్యమైన క్రిస్మస్ బహుమానముగా దేవుడు నీ కొరకు పంపించాడు. దేవుని యొక్కబహుమానమును నీవు స్వీకరించి దేవుని దీవెనలను పొందు కొనగలవు.

## అక్టోబర్ 2, 2012 జరిగిన ఉపవాస ప్రార్థనలో
## అనేకులు పాల్గొని దేవునిని ఆరాధించడం జరిగినది





*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras